క్లుప్తంగా

జగన్నాథ రథయాత్ర రేపు

ఎంవీపీకాలనీ: ఈ నెల 27న హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుంది. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు మీదుగా టీటీడీ కూడలి, ఇసుకతోట జంక్షన్, వెంకోజిపాలెం కూడలి, క్యాన్సర్ హాస్పిటల్, అప్పుఘర్ బీచ్ రోడ్డు మీదుగా రథయాత్ర సాగి.. తిరిగి ఐఐఏఎంకు చేరుతుంది. యాత్రలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జగన్నాథ మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఏయూను సందర్శించిన జపాన్ ప్రతినిధులు



జపాన్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఏయూ ప్రగతిని వివరిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీని బుధవారం జపాన్ దేశానికి చెందిన జెట్రో(జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విద్యార్థులకు ఉపయుక్తంగా, లబ్ధిచేకూరేలా ఉండే నూతన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే దిశగా చర్చలు సాగించారు. వీసీ రాజశేఖర్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. పర్యటనలో భాగంగా నాస్కామ్ సెంటర్, డీన్ బెట్రీచ్ విభాగాలను ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో జెట్రో తోయమ చిప్ తమురా కెన్, సీనియర్ డైరెక్టర్ జుంకి యమాపిట, డైరెక్టర్ జనరల్ కావోరు శిరయిపి, అసిస్టెంట్ డైరెక్టర్ వీర బాబు వీర్ల, డీన్ బెట్రీట్ ఆచార్య కె.రమాసుధ, రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: యువత మాదవ ద్రవ్యాలకు దూరంగా.. ఉజ్వల భవితకు బాటలు వేసే విద్య దగ్గరగా ఉండాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు అన్నారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బుధవారం కృష్ణా కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 15 రోజులుగా కళాశాల విద్యార్థులకు సెమినార్, పోస్టర్ పెయింటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుని వాటికి బానిసలుగా మారిపోవడం వల్ల యువత భవిష్యత్ చిత్తవుతుందన్నారు. యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు ఉన్నత భారత అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జీవీఎంసీ నూతన కమిషనర్ కేతన్ గార్గ్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను శాలువాతో సత్కరించి, అంబేడ్కర్ మెమెంటోను అందించారు. 51వ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆయనను కార్పొరేటర్ కోరారు.

– తాటిచెట్లపాలెం

మట్టిలో మాణిక్యాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ట్రిపుల్ ఐటీల్లో సీట్లు
- టెన్త్ టాపర్లుగా నిలిచిన పేద, మధ్యతరగతి విద్యార్థులు
- నూజివీడు, శ్రీకాకుళం, కడప, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు ఎంపిక
- ఉత్తమ ఇంజినీర్లుగా రాణిస్తామని ఆకాంక్ష



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్

సీతంపేట: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సంపాదించి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినప్పటికీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సర్కారు బడుల్లోని సదుపాయాలను సద్వినియోగం చేసుకున్నారు. టెన్త్‌లో స్కూల్ టాపర్లుగా నిలిచి ప్రతిష్టాత్మకమైన నూజివీడు, శ్రీకాకుళం, కడప, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించి మట్టిలో మాణిక్యాలు అనిపించుకున్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు, 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన మరో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందారు. మొదటి ఫేజ్‌లో ఆరుగురు సీట్లు సాధించగా.. మిగిలిన ఫేజ్‌లలో మరింత మంది ఎంపిక అవుతారని హెచ్ఎంలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం బోధన, ట్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించగలిగారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంప్యూటర్ ఇంజినీర్ అవుతా..



టెన్త్‌లో 583 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాను. నాన్న సోమేష్ తాపీ మేస్త్రి, అమ్మ ఆదిలక్ష్మి హౌస్‌వైఫ్. అమ్మ, నాన్నల కష్టం చూశాను. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. బాగా చదువుకుని భవిష్యత్‌లో మంచి కంప్యూటర్ ఇంజినీర్ అవుతాను. ఆరు నుంచి టెన్త్ వరకు మధురానగర్ హైస్కూల్‌లో చదివాను. 8వ తరగతి నుంచి ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌లు సబ్జెక్టుల్లో నన్ను నేను మెరుగుపర్చుకోవడానికి సహాయపడ్డాయి. హెచ్ఎం శాంతికుమారి, ఉపాధ్యాయులు బాగా గైడ్ చేసేవారు.

– ఎం.సాయిసంపత్, మధురానగర్ హైస్కూల్

లెక్చరర్ కావడమే లక్ష్యం



పదో తరగతిలో 575 మార్కులు సాధించి స్కూల్ సెకెండ్ టాపర్‌గా నిలిచాను. నాన్న సూరిబాబు కార్పెంటర్‌గా పని చేస్తూ నన్ను కష్టపడి చదివించారు. అమ్మ హౌస్‌వైఫ్. ఐదో తరగతి నుంచి టెన్త్ వరకు మధురానగర్ హైస్కూల్‌లో చదివాను. హెచ్ఎం మేడం, ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. స్టడీ అవర్స్‌లో చక్కగా చదివించారు. వెనుకబడిన సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు ఎలా తెచ్చుకోవాలో గైడ్ చేసేవారు. దీంతో టెన్త్‌లో మంచి మార్కులు సాధించగలిగాను. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. భవిష్యత్‌లో లెక్చరర్ కావాలన్నది నా లక్ష్యం.

– ఎం.దుర్గాసంతోషి, మధురానగర్ హైస్కూల్

తల్లిదండ్రులను బాగా చూసుకుంటా..



నాన్న అప్పలరాజు సైకిల్ మెకానిక్. అమ్మ లక్ష్మి సీతంపేటలో బ్యాంగిల్ షాపు నిర్వహిస్తూ నన్ను చదివిస్తున్నారు. టెన్త్‌లో 570 మార్కులు వచ్చాయి. ఏడో తరగతి నుంచి 10 వరకు మధురానగర్ హైస్కూల్‌లో చదివాను. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో చేరాను. అమ్మా నాన్న చాలా కష్టపడుతున్నారు. భవిష్యత్‌లో మంచి ఇంజినీర్నై వారిని బాగా చూసుకోవాలన్నది నా కోరిక.

– కోసూరు జశ్వంత్, మధురానగర్ హైస్కూల్

ఎన్‌సీసీ కోటాలో ఎంపికయ్యా..



పదో తరగతిలో 576 మార్కులు వచ్చాయి. నాన్న రమణ సెలూన్ వృత్తిలో, అమ్మ పైడిరాజు కూలి పనులు చేస్తూ నన్ను చదివిస్తున్నారు. తాటిచెట్లపాలెంలో ఉంటున్నాం. ఎన్‌సీసీ క్యాడెట్ కావడంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇంజినీరింగ్ చదివి మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులను బాగా చూసుకుంటాను.

– అమలాపురం దినేశ్, ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్

మంచి జాబ్ సంపాదిస్తా..



టెన్త్‌లో 577 మార్కులు వచ్చాయి. నాన్న కృష్ణ కూలి పని, అమ్మ లక్ష్మి హౌస్‌వైఫ్. తాటిచెట్లపాలెంలో నివసిస్తున్నాం. కడప ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇంజినీరింగ్ పూర్తి చేసి మంచి జాబ్ సంపాదిస్తా. అమ్మా నాన్నలను బాగా చూసుకుంటా.

– కె.సతీష్, ఎన్జీజీవోస్ కాలనీ, హైస్కూల్

ఇంజినీర్‌గా స్థిరపడతా..



నాన్న శ్రీను ఆటో నడుపుతూ చదివిస్తున్నారు. అమ్మ గృహిణి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో టెన్త్‌లో 571 మార్కులు సాధించాను. అక్కయ్యపాలెం పాతపోస్టాఫీస్ వీధిలోని అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. భవిష్యత్‌లో మంచి ఇంజినీర్‌గా స్థిరపడతాను.

– పి.మౌనిక, ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం ప్రభుత్వ ఓల్డ్ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నరవ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రెండో విడత ప్రవేశాలకు సంబంధించి నరవ ఐటీఐలో ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, డిజిటల్ మెకానిక్ ట్రేడ్‌ల్లో సీట్లు మిగిలాయని తెలిపారు. www.iti.gov.in వెబ్‌సైట్ లో జూలై 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆ స్లిప్‌ను తీసుకుని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 17వ తేదీలోపు నరవ ఐటీఐకి వెళ్లి వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. జూలై 21వ తేదీ ఉదయం 10 గంటలకు కంచరపాలెంలోని నరవ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 93932 60568, 63057 83675 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



మద్దిలపాలెం: అమావాస్య సందర్భంగా బుధవారం 15వ వార్డు కొత్త వెంకోజిపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కొలువైన కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మ భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, శరకం సత్యారావు, బోర యర్రాజీ రెడ్డి, వేగి వెంకటరమణ, సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

కంచరపాలెం: సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. 54వ వార్డు 104 ఏరియా జ్యోతినగర్ సచివాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్మికులకు ఇంకా జీతాలు ఇవ్వకపోవడంపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. తక్షణమే మున్సిపల్ కార్మికులకు జీతాలివ్వాలని, కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వేయకుండా, స్టీల్‌ప్లాంట్‌లో 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం ద్వారా ప్రజలను హింసించి నాటకాలాడుతోందన్నారు. జూలై 9న సమ్మెను జయప్రదం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తీవ్రమైన హెచ్చరిక జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, ఎం.నూకరాజు, రాయప్పడు, రమణమ్మ, ధనలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్' విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలివ్వాలి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినపత్రం అందిస్తున్న దళిత హక్కుల సంఘం నాయకులు

ఆరిలోవ: బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం ఇవ్వాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో తమ పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని, యూనిఫారం, పుస్తకాలు అందజేయాలని నినాదాలు చేశారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కొనసాగించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో 10 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయిలు ఉండటంతో పాఠశాలల యాజమాన్యాలు ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు ఆయా సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. అనంతరం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై డీఈవో స్పందించి నగరంలోని భాష్యం, చలపతి తదితర స్కూళ్ల ప్రిన్సిపాళ్లను కార్యాలయానికి పిలిపించి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద పుస్తకాలు, యూనిఫారం అందించాలని ఆదేశించారు. పాఠశాలలకు ఉన్న బకాయిల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కనకరాజు, కనకమహాలక్ష్మి, త్రినాథ్, నాగరాజు, పావని, పార్వతి, గురుమూర్తి, దేవి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయాలి

- ప్రభుత్వానికి 'పీఆర్‌టీయూ' విజ్ఞప్తి



నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

బీచ్‌రోడ్డు: మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులకు న్యాయం చేసి.. 'నియర్ బై రెసిడెన్సీ' జీవోను కొనసాగించాలని పీఆర్‌టీయూ ప్రతినిధులు గోపీనాథ్, నాగేశ్వరరావు, వెంకటపతి రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ధర్నాలో పీఆర్‌టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ 2025 బదిలీల్లో 2008, 1998 ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా మైదాన ప్రాంతంలోని అన్ని క్లస్టర్ పోస్టులను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలో మొత్తం 184 మంది 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఉన్నారని, అందులో 84 మంది పురుషులు, 100 మంది మహిళలు ఉన్నారని వివరించారు. అలాగే జిల్లాలో మొత్తం 245 మంది 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల్లో 185 మంది పురుషులు, 60 మంది మహిళలు ఉన్నారని గణాంకాలు వెల్లడించారు. ప్రతి మండలంలో ఉన్న సింగిల్ టీచర్ పాఠశాలలో ఒక ఎంటీఎస్ టీచర్‌ను సర్దుబాటు చేయాలని సూచించారు. మైదాన ప్రాంతంలోని ప్రతి మండలంలో నూతనంగా రూపొందించిన మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒక ఎంటీఎస్ టీచర్‌ను సర్దుబాటు చేయాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యలు తప్ప ప్రయోజనం లేదు

రిలే నిరాహార దీక్షను ఆపివేయాల్సిందిగా రెండో పట్టణ సీఐ ఎర్రం నాయుడు ఉపాధ్యాయులను కోరారు. ఇక్కడ ధర్నా చేయడం వల్ల ప్రయోజనం ఏంటని, బందోబస్తు సమస్య వస్తోందన్నారు. డీఈవోను కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని వారికి సూచించారు. అయితే మూడు గంటల వరకు దీక్ష చేసి, అనంతరం డీఈవో కార్యాలయం వద్ద జరిగే టీచర్స్ కౌన్సెలింగ్‌ను అడ్డుకోనున్నట్టు యూనియన్ నేతలు తెలిపారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోగా.. తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన చేపడతామని టీచర్లు స్పష్టం చేశారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు



సాయి దర్బార్‌లో కొలువైన వారాహి, రాజాశ్యామల అమ్మవార్లు

అల్లిపురం: శ్రీ షిర్డీసాయి దర్బార్‌లో గురువారం నుంచి జూలై 24 వరకు వారాహి నవరాత్రులు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాసులు తెలిపారు. తొలి రోజు ఉన్మత్త వారాహి, రెండో రోజు బృహత్ వారాహి, మూడో రోజు స్వప్న వారాహి, నాలుగో రోజు కిరాత వారాహి, ఐదో రోజు శ్వేత వారాహి, ఆరో రోజు ధూమ్ర వారాహి, ఏడో రోజు మహా వారాహి, ఎనిమిదో రోజు వార్తలి వారాహి, తొమ్మిదో రోజు దండిని వారాహి, పదో రోజు ఆది వారాహి మాతగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా దేవాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎడతెరిపి లేని వాన



మహారాణి పార్లర్ కూడలిలో కురుస్తున్న వర్షం



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో వానలో ప్రయాణిస్తున్న వాహనాలు

సీతంపేట: గత వారం రోజులుగా మండుతున్న ఎండలతో సతమతమవుతున్న జనానికి చల్లటి వాన ఊరటనిచ్చింది. బుధవారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా జోరుగా కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. చల్లని వాతావరణంలో జనం సేదతీరారు. వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగిందని, ఎండా కాలం పోయి వర్షా కాలం వచ్చినట్టుందని సంబరపడ్డారు. తెల్లవారు నుంచి వాన కురవడంతో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు గొడుగులు, రెయిన్‌కోట్లు ఆశ్రయించారు. ఉద్యోగులు, వ్యాపారులు తమ విధులకు, అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని చిరువ్యాపారాలు తెరుచుకోలేదు. సీతంపేట, అక్కయ్యపాలెం, జగన్నాథపురం, శ్రీనివాసనగర్, అబిద్‌నగర్, నరసింహనగర్ ప్రాంతాల్లోని రహదారులపై వర్షపు నీరు ఏరులై ప్రవహించింది. మూడు రోజులుగా నరసింహనగర్ రైతుబజార్‌లో కొనేవారు లేక వెలవెలబోయింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి డ్రెయిన్లు, గెడ్డలు పొంగిపొర్లి ప్రవహించాయి.



శంకరమఠం రోడ్డులో వాహన చోదకుడి పాట్లు

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- 21వ వార్డులో విస్తృత పర్యటన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

బీచ్‌రోడ్డు: విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ప్రజారోగ్య అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. 21వ వార్డు చినవాల్తేరులోని మసీదు వీధి, విజయనగర్ కాలనీ, నేతాజీనగర్, కొయ్య వీధి, చినవాల్తేరు అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో భాగంగా కాలువల్లోని వ్యర్థాల తొలగింపు మొదలైనవి ప్రతి రోజు విధిగా చేపట్టాలన్నారు. పలుచోట్ల కాలువల్లో పారుతున్న మురుగునీటిని పరిశీలించి, నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు. వార్డులోని పుష్ కార్ట్‌లను అన్ని చోట్ల వినియోగించేలా చర్యలు చేపట్టాలని జోన్–3 కమిషనర్ కె.శివప్రసాద్‌కు సూచించారు. వర్షా కాలంలో గెడ్డలు పొంగకుండా, కాలువల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఆదేశించారు. మసీద్ వీధిలోని కాలువలు, రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలను గమనించి, యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శిని ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న వారు నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయకుండా చర్యలు చేపట్టాలని జెడ్సీని ఆదేశించారు. వీధుల్లో తాగునీటి సమస్య, వీధిలైట్ల నిర్వహణ గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లోని అన్ని వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఉంచాలని, రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని వ్యాపారులకు సూచించారు. వార్డులోని అన్ని నివాసాలు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కలిగి ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం చిన వాల్తేరులోని మెంటల్ హాస్పిటల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను, దాని నిర్వహణను జీవీఎంసీ కమిషనర్ పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న వారికి సకాలంలో జీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిత్యం వేడి ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. పర్యటనలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో బి.ప్రసాదరావు, ఈఈ గంగాధర్, సుధాకర్, పద్మావతి, ఏఈఈ విల్సన్, ఏపీడీ రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టంతోనే ముఠా కార్మికులకు న్యాయం

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో వివిధ షాపులు, గొడౌన్లలో పని చేస్తున్న ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్‌లోని సిటు కార్యాలయంలో బుధవారం ముఠా వర్కర్స్ సీనియర్ 10వ మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిటు పతాకాన్ని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై.రాజు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రతినిధుల సభలో గత మూడేళ్ల కాలంలో యూనియన్ చేపట్టిన కార్యక్రమాల రిపోర్ట్‌ను కార్యదర్శి ప్రవేశపెట్టారు. సభ్యులు దానిపై చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ముఠా కార్మికుల ఉపాధికి రక్షణ లేకుండా పోతుందన్నారు. పనిలో ప్రమాదం జరిగితే కార్మికులకు ఏ విధంగా నష్టపరిహారం అందడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ముఠా కార్మికులకు లోడింగ్, అన్ లోడింగ్ కూలీ రేట్లు పెంచాలన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగే విధంగా కార్మిక చట్టాలు మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకు వచ్చిందన్నారు. వాటిని రద్దు చేయాలని కోరుతూ వచ్చే నెల 9న దేశ వ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరగనుందని, ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.